# పెరుగుతున్న నిరుద్యోగం

**దేశంలో** ఎన్నికలు జరుగుతున్న సమయంలో వినిపించే వాగ్దానం ఉద్యోగాల కల్పన. ఎన్నికల అనంతరం కూడా ఉద్యోగాల అభ్యున్నతి పెరుగుతూనే వుంటుంది గాని తరగదు. పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే 2019 మే 31న వివరాలు వెల్లడించింది. దీని ప్రకారం ప్రతి ఏటా నిరుద్యోగం పెరుగుతూనే వుంది.

2011-12 నుండి 2017-18 మధ్యకాలంలో 10 లక్షలమందికి పైగా ఉపాధి కోల్పోయారు. 2011-12లో 47 కోట్ల 25 లక్షలమంది ఉద్యోగాలు ఉండగా 2017-18 కల్లా 47 కోట్ల 13 లక్షలకు తగ్గింది. గ్రామీణ మహిళలు 2.5 కోట్లమంది ఉపాధి కోల్పోవటం దీనికి ప్రధాన కారణంగా ఉంది. ఈ శతాబ్దం ఆరంభం నుంచి ఈ తగ్గుదల కనిపిస్తోంది. గ్రామీణ పురుషుల ఉపాధిలో కూడా నాలుగు రెట్లు తగ్గుదల సూచిస్తోంది. గతంలో గ్రామీణ మహిళలలో ఉన్న నిరుద్యోగిత ప్రస్తుతం గ్రామీణ పురుషుల విషయంలో కూడా వ్యాపించింది. గ్రామీణ ప్రాంతాల్లో అధికశాతం మంది వ్యవసాయం పనుల్లో ఉండటంవల్ల ఆ రంగంలో సంక్షోభ ప్రభావం వారిపై పడుతోంది. 2011-12 నుంచి 2017-18 మధ్యకాలంలో 2 కోట్ల 70 లక్షలమంది ఆ రంగాన్ని వదిలి వేశారు. వీరు ఇతర రంగాల్లో ఉద్యోగావకాశాలు దొరకటంవల్ల కాదు. వ్యవసాయరంగంలో తగిన ఆదాయం లేక. వ్యవసాయేతర రంగం కూడా వీరికి ఉపాధి కల్పించే పరిస్థితిలో లేదు. ఈ రకంగా 2004-05 నుంచి 2011-12 మధ్య కాలంలో 3 కోట్ల 40 లక్షలమంది వ్యవసాయ రంగం నుంచి వైదొలిగారు. 2011-12 నుంచి 2017-18 కాలంలో 2 కోట్ల 70 లక్షలమంది వైదొలిగారు. ఇంతకుముందు కాలంలో కోటి 40 లక్షలమందికి పైగా మొత్తంగా ఉపాధి లభించినా ప్రస్తుత కాలంలో 10 లక్షల 20 వేలమంది ఉపాధి కోల్పోయారు.

వ్యవసాయేతర రంగంలో ఈ కాలంలో ఉపాధి సగానికి పడిపోయింది. అదే గత కాలంలో వ్యవసాయేతర రంగంలో 4 కోట్ల 80 లక్షలమందికి పైగా ఉపాధి లభించగా ప్రస్తుతం 2 కోట్ల 59 లక్షలమందికే ఉపాధి లభిస్తోంది. దీన్నిబట్టి అర్థమవుతున్నది ఏమిటంటే వ్యవసాయేతర రంగంలో ఉపాధిని పెంచి వ్యవసాయరంగాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. జన్‌ధన్‌యోజన, నగదు బదిలీ వంటి శుష్క నినాదాలు అల్ప ప్రయోజనాలుగానే మిగులుతున్నాయి. రుణవిముక్తి, నైపుణ్యాభివృద్ధి వంటివి సరైన దిశలో సాగటంలేదు. తయారీ రంగాన్ని పటిష్టం చేయటం, వ్యవసాయంలో పెట్టుబడులు పెంచటం తక్షణావసరంగా ఉంది. యుపిఏ వ్యవసాయరంగంలో ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించే నెపంతో పెట్టుబడులను ఉపసంహరించింది. సామ్రాజ్యవాదశక్తులకు తయారీరంగాన్ని బలి పెట్టింది. యుపిఏ అడుగుజాడల్లోనే బీజేపీ నడుస్తోంది.

# పొట్ట చేతపట్టుకొని ప్రవాసం

**అంతర్జాతీయంగా** ప్రవాసుల సంఖ్య 2019లో 27 కోట్ల 20 లక్షలకు చేరింది. 2010లో కన్నా ఇది 5 కోట్ల 10 లక్షలు ఎక్కువ ప్రపంచ జనాభాలో ప్రవాసుల సంఖ్య 3.5 శాతంగా ఉంది. ఈ లెక్కలన్నీ ఐక్యరాజ్యసమితికి చెందిన ఆర్థిక, సామాజిక వ్యవహారాల కమిటీ వెల్లడించింది.

ఈ ప్రవాసుల్లో 33 శాతంమంది 10 దేశాలకు చెందినవారే. ఇండియా నుంచి 6.5 శాతం, మెక్సికో 4.5, చైనా 4, రష్యా 3.5, సిరియా 3, బంగ్లాదేశ్ 2 శాతంమంది ఉన్నారు. ఇండియా నుంచి వెళ్ళేవారికి ఎమిరేట్స్ ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. ఈ ప్రవాసులంతా కూడా ఒక అభివృద్ధిచెందుతున్న దేశం నుంచి మరో అభివృద్ధిచెందుతున్న దేశానికే వెళుతున్నారు. బలవంతపు ప్రవాసాలను మినహాయిస్తే ఈ సంఖ్య 6 శాతం ఉంటుంది.

2010-2017 మధ్యకాలంలో శరణార్థులు, ఆశ్రయం కోరేవారి సంఖ్య కోటి 30 లక్షల మందికి చేరింది. అమెరికా సామ్రాజ్యవాద యుద్ధాలు ముఖ్యంగా సిరియా, ఉత్తర ఆఫ్రికా, లిబియాలలో చెలరేగిన ఘర్షణలు ముఖ్య కారణాలుగా చెప్పవచ్చు. ఈ శరణార్థులు ముఖ్యంగా యూరపులో దయనీయ స్థితిలో ఉన్నారు. యుద్ధాలు చెలరేగిన ప్రాంతాల నుండి వెళ్ళే సమయంలో చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారు.

ఇండియాలో పెరుగుతున్న నిరుద్యోగం యువకులను వలసబాట పట్టిస్తోంది. వీరు వారి కుటుంబాలకు పంపే డబ్బే భారత ఆర్థికవ్యవస్థను అప్పుల ఊబిలో పడకుండా చేస్తోంది. అయినా కూడా వారిని నిర్లక్ష్యం చేయడమే కాకుండా అనేక కష్టాలకు గురిచేస్తున్నారు. ఇండియా నుంచి మేధోవలస వల్ల కూడా భారత శాస్త్ర, సాంకేతిక రంగాలు కునారిల్లుతున్నాయి.

ooo